నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 13 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

భోగి మంటల వద్ద యువకులు (ఫైల్)

వేడుకల వద్ద గంగిరెద్దు విన్యాసాలు (ఫైల్)

నేడు సంక్రాంతి

- సకల కాంతులు, సరికొత్త వెలుగుల లోగిలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పల్లెల్లో పొంగల్ సందడి
- నేడు భోగి, రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ
- పిండి వంటల ఘుమఘుమలు.. హరిదాసుల కీర్తనలు..
- వాకిళ్లను ముద్దాడుతున్న రంగవల్లులు
- పట్టణాల నుంచి సొంతూళ్లకు చేరుకుంటున్న పల్లెవాసులు

పాల్వంచ బస్టాండ్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

భోగ భాగ్యాల భోగి..

మకర సంక్రాంతికి ముందు రోజు వచ్చే పండుగ భోగి. ఈ భోగి పండుగ చాలా ఉత్సాహంగా ఉంటుంది. ఈ పండుగ రోజు ఇంట్లోని పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ వేకువ జామునే నిద్రలేస్తారు. ఇంట్లో ఉన్న పుల్లలు, పాత సామగ్రి, ఆవుపేడతో చేసిన పిడకలు మొదలైన వాటితో మంటలు వేస్తారు. వీటినే భోగి మంటలు అని పిలుస్తారు. ఇక మరో ప్రత్యేకమైనది బొమ్మల కొలువు. ఇది మన పూర్వికుల సంప్రదాయం. వారు వినియోగించిన వస్తువులను ఇప్పటి చిన్నారులు మర్చిపోకుండా ఉండాలనే ఉద్దేశంతోనే పలు రకాల బొమ్మలతో ఈ బొమ్మలకొలువును ఏర్పాటు చేస్తారు. ఈ బొమ్మల కొలువుకు ఇరుగుపొరుగు మహిళలను ఆహ్వానించి హారతి ఇస్తారు. చిన్నారుల తలలపై రేగిపండ్లు పోస్తారు. వీటినే భోగిపండ్లు అంటారు.

సకల కాంతుల సంక్రాంతి..

సంక్రాంతి రోజు వేకువజామునే లేచి స్నానాలు చేసి ఆడబిడ్డలు ఇళ్ల ముందు ముగ్గులు వేస్తుంటే.. పెద్దవాళ్లు ఇంటికి తోరణాలు కడతారు. పనివారికి, ఇతర వృత్తిదారులకు పిండి వంటలను పంచిపెడతారు. కొత్త అల్లుళ్లకు ఈ పండుగ మరీ ప్రత్యేకం. కొత్తగా వివాహమైన కుమార్తెను, అల్లుడిని ఇళ్లకు పిలిచి ఘనంగా పండుగ జరుపుకుంటారు. నూతన వస్త్రాలు అందజేస్తారు. పండుగల అనంతరం వారిని సంతోషంగా పంపుతారు. కొన్ని ప్రాంతాల్లో ఈ రోజున పితృతర్పణాలు కూడా సమర్పిస్తారు. పెద్దలను గుర్తుచేసుకుంటారు.

కనుమ.. ముక్కతినాల్సిందే..

సంక్రాంతి తర్వాతి రోజు వచ్చేది కనుమ. ఈ పండుగ ఈ రోజున పశువులకు పూజ చేస్తారు. కనుమ అంటే ప్రతీ ఇంట్లో నాటుకోడిని కోసి ఆరగించడం ఆనవాయితీ. అది నేటికీ కొనసాగుతుంది. కనుమ రోజు ఇంటి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లరు. దీని తర్వాత వచ్చే పండుగ ముక్కనుమ. ఈ పండుగకు పల్లెటూళ్లలో మంచి సందడి నెలకొంటుంది. అయితే పట్టణాల్లో ఈ పండుగ ప్రత్యేకతను చాటేందుకు భోగిమంటలు వేయడంతోపాటు ముగ్గుల పోటీలను నిర్వహిస్తూ.. గాలిపటాల పోటీలను నిర్వహిస్తూ ఉంటారు.

రంగవల్లుల శోభ..

మూడు రోజులపాటు జరిగే సంక్రాంతి పండుగకు వాకిళ్లు రంగవల్లులతో ప్రత్యేక శోభను సంతరించుకుంటాయి. ఆడబిడ్డలు పోటీపడి మరీ రథం ముగ్గులు వేస్తుంటారు. ఇంటి వాకిళ్లలో గొబ్బెమ్మలను పెట్టి అప్పుడే వచ్చిన పంటలను, ధాన్యాన్ని, ఇళ్లలో పండిన కూరగాయలను ముగ్గులపై ఉంచుతారు. ఇంటికి వచ్చిన దూడూ బసవన్నలకు కూడా ఆహారాన్ని అందించి గోవులను పూజిస్తారు.

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సరికొత్త లోగిళ్ల సంక్రాంతి రానే వచ్చింది. ఏటా మకర సంక్రమణ నాడు వచ్చే సంక్రాంతి తమ జీవితాల్లో సకల కాంతులనూ నింపుతుందన్నది తెలుగు ప్రజల అభిలాష. అందుకే ఈ పండుగ అచ్చ తెలుగుదనానికి ప్రతీక. ముత్యాల ముగ్గులు, ముంగిళ్లలో గొబ్బెమ్మలు, హరిదాసుల కీర్తనలు, బసవన్నల విన్యాసాలు, పిండి వంటల ఘుమఘుమలు, గాలిపటాలతో చిన్నారుల కేరింతలతో ఇల్లంతటినీ సందడితో నింపే సకల శుభాలు వేదిక. తెలుగు ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకునే వేడుక. సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశించిన నాటి నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుందని, గడచిన నెల రోజులుగా కొనసాగిన ధనుర్మాసం ముగుస్తుందని, దీనిని గుర్తుచేసుకుంటూనే సంక్రాంతిని జరుపుకుంటారని పురాణలు చెబుతున్నాయి. రైతులు చెమటోడ్చి పండించిన పంటలు సరిగ్గా ఇదే సమయంలో చేతికొస్తాయని, ధాన్యపు రాశులు ఇళ్లకు చేరతాయని, అందుకని రైతులందరికీ ఇది విశేషమైన పండుగ అని ప్రతీతి. దీంతో ఇంతటి విశిష్టమైన ఈ పండుగను ఘనంగా జరుపుకునేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. బతుకుదెరువు కోసం దూర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉమ్మడి జిల్లాలోని పల్లె ప్రజలందరూ ఇప్పటికే తమ సొంతిళ్లకు చేరుకుంటున్నారు. దీంతో మంగళవారం నుంచి 3 రోజుల పాటు ప్రతి ఇంట్లోనూ పండుగ వాతావరణం నెలకొంటుంది.

సంక్రాంతి అంటే సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. మకర సంక్రమణం జరిగింది కాబట్టే మకర సంక్రాంతి అని పిలుస్తారు. సంక్రాంతికి ముందురోజు వచ్చే పండుగ భోగి. సంక్రాంతికి తరువాత రోజు వచ్చేది కనుమ. ఈ పండుగను హిందువులు వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో పవిత్రంగా జరుపుకుంటారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో సంక్రాంతి అని, తమిళనాడులో పొంగల్ అని పిలుస్తారు. ఈ పండుగ సందడి నెల రోజుల ముందుగానే మొదలవుతుంది. ప్రతి ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు స్వాగతం పలుకుతుంటాయి. వేకువజామున హరినామ కీర్తనలతో హరిదాసులు నెల రోజుల ముందు నుంచే వస్తూ ఉంటారు. గంగిరెద్దులు వచ్చి దీవెనలు అందిస్తూ ఉంటాయి. మొత్తంగా ప్రతి పల్లెలోనూ సంప్రదాయం ప్రతిబింబిస్తుంది. తెలుగు వారి పెద్ద పండుగ కావడంతో ఈ పర్వదినాన అందరి గృహాలు ఇప్పటికే కొత్త అల్లుళ్లు, బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాల నిమిత్తం హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు పట్టణాల్లో నివాసం ఉంటున్న తెలంగాణ పల్లె వాసులు సొంతూళ్లకు చేరుకుంటున్నారు.

ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఖమ్మం పాత బస్టాండ్

కాంగ్రెస్‌ది గూండాగిరి

ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై రౌడీయిజం: రేగా

రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జనవరి 12: ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. అందుకనే తమ పార్టీ కార్యాలయాలపై దాడులకు పురిగొల్పుతోందని విమర్శించారు. గూండాగిరీ ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. భువనగిరిలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని ఖండిస్తూ ఆదివారం రేగా ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ఆఫీసుపై కాంగ్రెస్ నాయకుల దాడి అత్యంత హేయమైనదని అన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటూ చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అభివృద్ధి చేతగాక ప్రతిపక్షంపై దాడులకు దిగుతోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టేలా వారికి హామీలు ఇచ్చిందని ధ్వజమెత్తారు. ఆ హామీలను నెరవేర్చకపోగా ప్రజల తరపున ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై కక్ష పెంచుకుంటున్నదని అన్నారు. సమాధానం చెప్పలేకనే బీఆర్ఎస్ నాయకులపైనా, కార్యాలయాలపైనా దాడికి పాల్పడుతున్నదని దుయ్యబట్టారు. తమ పార్టీ నేతలపై కేసులు పెట్టడం, పార్టీ ఆఫీసులపై రౌడీయిజం చేయించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. నాడు మాటలు చెప్పిన ప్రభుత్వం చేతల్లో ఎందుకు విఫలమైందో ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

సమాధానం చెప్పలేకనే దాడులు

బీఆర్ఎస్ కార్యాలయంపై గూండాగిరీ దుర్మార్గం: దిండిగాల

దిండిగాల రాజేందర్

ఇల్లెందు, జనవరి 12: హామీల అమలు గురించి ప్రజల తరపున బీఆర్ఎస్ అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే ప్రభుత్వం దాడులకు దిగుతున్నదని గ్రంథాలయ సంస్థ భద్రాద్రి జిల్లా మాజీ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు దిండిగాల రాజేందర్ ధ్వజమెత్తారు. హామీలు అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాల్సిందిపోయి ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతి విమర్శలు ఎంతో సహజమని అన్నారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు హుందాగా సమాధానం చెప్పాల్సిందిపోయి దాడులను ప్రోత్సహించడం హేయమైన చర్య అని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉందని జ్ఞప్తికి తెచ్చారు. కానీ ప్రభుత్వం మాత్రం ప్రశ్నించేవారిపై దాడులను చేయిస్తోందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఆఫీసుపై దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'మద్దతు' దక్కేదెన్నడు?

- సీజన్లు పూర్తవుతున్నా రైతుకు లభించని మద్దతు ధరలు
- ఏజెన్సీలో సగం ధరకే పంటను కొంటున్న దళారులు
- నియోజకవర్గంలో దూరాభారంగా మార్కెట్ యార్డులు
- ఫలితంగా గ్రామాల్లోనే అమ్ముకుంటున్న అన్నదాతలు
- దీంతో ఇటు ఎమ్మెస్పీ, అటు బోనస్ దళారుల పాలు

మద్దతు ధర కల్పిస్తామంటూ, బోనస్ చెల్లిస్తామంటూ గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. చివరికి ఆ రెండింటినీ రైతుల చెంతకు చేరకుండా చేస్తున్నది. అసలే ఏజెన్సీ ప్రాంతం కావడం.. పంటను మార్కెట్ యార్డుకు తీసుకెళ్లడం దూరాభారంగా మారుతుండడం వంటి కారణాలతో మారుమూల గిరిజన ప్రాంతాల రైతులు తాము చెమటోడ్చి పండించిన పంటను తమ గ్రామాల్లోనే దళారులకు విక్రయించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను, బోనస్‌ను కోల్పోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు కూడా దళారులకు కలిసి వస్తున్నాయి. గ్రామాల్లో రైతుల దగ్గర వారి పంటలను సగం ధరకు కొంటున్న దళారులు.. మార్కెట్ యార్డుల్లో మద్దతు ధరకు తిరిగి రైతుల పేర్లతోనే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటు మద్దతు ధరను, అటు బోనస్‌ను పొందుతున్నారు. దీంతో అన్నదాతలు అన్నివిధాలా మోసపోతున్నారు. –ఇల్లెందు, జనవరి 12

రైతులకు అండగా ఉంటామంటూ, వారు పండించిన పంటలకు మద్దతు ధరలు అందిస్తామంటూ ప్రగల్భాలు పలుకుతూ ప్రకటనలు గుప్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. దీంతో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న రైతన్నలు నిలువునా మునుగుతున్నారు. గ్రామానికో నాలుగు చిల్లర కొంటర్లు ఏర్పాటుచేసుకుంటున్న దళారులు.. రైతుల వద్ద తక్కువ ధరకే వారి పంటలను కొనుగోలు చేస్తున్నారు. కనీస అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు.. అన్నదాతల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో అటు ప్రభుత్వం పట్టించుకోక, ఇటు అధికారులు అవగాహన కల్పించక చివరికి కర్షకులే తమ కష్టానికి తగిన ఫలితాన్ని కోల్పోతున్నారు. ఫలానా దగ్గరకు వెళ్లి విక్రయిస్తే తాము పండించిన పంటకు మద్దతు ధర లభిస్తుందన్న సమాచారం కూడా మారుమూల గిరిజన ప్రాంతాల రైతులకు చేరడం లేదు. చివరికి సీజన్లకు సీజన్లు పూర్తవుతున్నా రైతులకు మాత్రం కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) దక్కడం లేదు.

ఇంటి ముందే లోడ్ చేస్తున్న హమాలీలు, (ఇన్‌సెట్‌లో) చేను వద్దనే ధాన్యం తీసుకెళ్తున్న దృశ్యం

అధికారులను బెదిరిస్తున్న వ్యాపారులు..

మద్దతు ధరలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంగళం పాడడాన్ని దళారులు తమకు అంది వచ్చిన అవకాశంగా భావిస్తున్నారు. ఎలాంటి లైసెన్స్‌లు లేకుండానే గ్రామాల్లో చిల్లర కొంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడికక్కడ ధాన్యాన్ని, పత్తిని, మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. అయితే, అధికార పార్టీ నాయకుల అండదండలతో వీరు ఏకంగా అధికారులను కూడా బెదిరింపులకు గురిచేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడి దళారులకు నిబంధనల ప్రకారం లైసెన్స్ ఉండదు. రైతుల వద్ద పంటను వీరు మద్దతు ధరకు కొనుగోలు చేయరు. కాంటాలు, తూకాలు సక్రమంగా వేయరు. నియమ నిబంధనలను ఏమాత్రమూ పాటించరు. కేవలం రైతులను మోసం చేసేందుకే ఏర్పాటు చేసినట్లుగా ఇక్కడి దళారుల పంటల కొనుగోలు కేంద్రాలు ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో సంబంధిత అధికారులు తనిఖీలు చేసినప్పుడు వీరి అక్రమ కొనుగోళ్లు వెలుగు చూస్తే ఏకంగా బెదిరింపులకు దిగుతారు. లేకుంటే అధికార పార్టీ నేలతో ఫోన్లు చేయించి భయభ్రాంతులకు గురిచేస్తుంటారు.

రైతుబంధు రాలేదు.. రుణమాఫీ కాలేదు..

పంటలు చేతికొచ్చాక మద్దతు ధరల విషయంలోనే రైతులను ముప్పుతిప్పలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అంతముందు పంటల పెట్టుబడి సాయం విషయంలోనూ అన్నదాతలకు చుక్కలు చూపించింది. సీజన్ మొదట్లోనే రైతుభరోసా పేరిట ఎకరానికి రూ.15 వేల సాయం ఇస్తామంటూ హామీలు గుప్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ తరువాత ఆ వాగ్దానాలను అటకెక్కించింది. మొదట వానకాలం సీజన్‌లోనూ, తరువాత యాసంగి సీజన్‌లోనూ రైతుభరోసా అందించలేదు. పైగా అంతకుముందు డిసెంబర్ నాటి రూ.2,500 పంటల పెట్టుబడి సాయాన్నీ పెండింగ్‌లోనే పెట్టింది. అయితే, రైతుభరోసా పేరిట ఎకరానికి రూ.12 వేలు ఇస్తామంటూ, అది కూడా ఈ నెల 26 నుంచి ఇస్తామంటూ చెబుతున్నప్పటికీ 'అన్ని విడతలవీ కలిపి ఏకమొత్తంగా ఇస్తారా? లేక గడిచిన సీజన్‌కు మాత్రమే ఇస్తారా?' అనే విషయాన్ని స్పష్టం చేయలేదు. ఇక రుణమాఫీ విషయంలోనూ రైతులందరినీ నిలువునా దగా చేసింది. కొద్దిమంది రైతులకు మాత్రమే రుణమాఫీని వర్తింపజేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అర్హుల్లో అనేకమందికి రుణమాఫీ చేయనేలేదు. కొందరికి సాంకేతిక కారణాలు చూపినప్పటికీ.. అధికమంది రైతుల రుణాలను మాఫీ చేసిన దాఖలాలు ఎక్కడా లేవు.

ఇల్లెందు మార్కెట్‌లో కొనుగోలు చేయాలి..

ఇల్లెందు పట్టణ సమీపంలో మాకు వ్యవసాయ భూమి ఉంది. అందులో సాగు చేసిన పంటలను విక్రయించేందుకు ఇబ్బంది ఎదురవుతోంది. ఎందుకంటే ఈ పంటలను ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు చేయరు. దీంతో పత్తి, మిర్చి పంటలను దూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించాల్సి వస్తోంది. ఈ దూరాభాన్నా భరించలేక నాతోటు ఇక్కడి రైతులు స్థానిక వ్యాపారులకే పంటలను విక్రయిస్తున్నాం. ఇల్లెందు మార్కెట్‌లో పత్తి, మిర్చి, ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తే మాకు మేలు జరుగుతుంది. – కే.హరిప్రసాద్, సుదిమళ్ల, ఇల్లెందు

ఈ సంవత్సరం మిర్చి కొనుగోలు చేస్తాం..

రైతులు తాము పండించిన పంటను స్థానిక చిల్లర కొంటర్ల వద్ద విక్రయించొద్దు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఇల్లెందు మార్కెట్ పరిధిలో ఉన్న ఎనిమిది మండలాల్లోని గ్రామాల్లో ఉన్న చిల్లర కొంటర్లను బంద్ చేయిస్తాం.అనుమతులు లేకుండా కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే, ఈ సంవత్సరం టేకులపల్లి మార్కెట్ యార్డులో మిర్చి పంటను కొనుగోలు చేస్తాం. లైసెన్స్ ఉన్న వ్యాపారులకే రైతులు తమ పంటలను విక్రయించాలి. –బానోత్ రాంబాబు, ఇల్లెందు ఏఎంసీ చైర్మన్

రవాణా సౌకర్యం లేదు..

మాది టేకులపల్లి మండలంలోని మూరుమూల గ్రామం నర్సాయిగూడెం. మా ఊరిలో మేం పండించిన పత్తి, మిర్చి పంటలను విక్రయించుకోవడానికి మార్కెట్ యార్డు దగ్గరలో లేదు. పైగా రవాణా సౌకర్యం కూడా సరిగాలేదు. దీంతో మేం స్థానికంగానే మా పంటలను అమ్ముకుంటున్నాం. మాకు సమీపంలో టేకులపల్లి మార్కెట్ యార్డు ఉంది. అక్కడ పంటలు కొనుగోలు చేస్తే మాకు ఉపయోగం ఉంటుంది. పంటలు అక్కడ విక్రయించి మద్దతు ధర పొందగలం. – యదల్లపల్లి బాబు, బేతంపూడి, టేకులపల్లి

మద్దతు ధర అందడం లేదు..

మా ప్రాంతంలో పండించిన పంటలకు మద్దతు ధర ఎంతో ఇక్కడి రైతులు తెలియదు. గ్రామంలో చిల్లర కొంటర్ల దగ్గరే ఎంతోకొంతకు మా పంటలను అమ్ముకుంటున్నాం. రైతులకు అవగాహన కల్పించి చిల్లర కొంటర్లను బంద్ చేయించాలి. ఇల్లెందులో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలి. – కొంపెల్లి రాములు, రాజీవ్‌నగర్, ఇల్లెందు మండలం